ఉపాధి వ్యవసాయం కలేనా..?

ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయే తప్ప అమలు చేయడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఎక్కువ మంది ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తుండడంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడు తోంది. దీంతో కూలీ రేట్లు పెరగడంతో సకాలంలో వ్యవసాయ పనులు పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. – సైదాపురం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- వ్యవసాయానికి ఉపాధి అనుసంధానం కోసం నిరీక్షణ
- ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు
- వ్యవసాయ పనులకు కూలీల కొరత
- 2014లో అనుసంధానం చేస్తామని హామీ
- అనుసంధానం చేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు

జిల్లాలోని 34 మండలాల్లో 2.66 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 2,.2లక్షల మంది కూలీలుగా నమోదై ఉన్నారు. అందులో రోజూ సుమారు లక్ష మంది వరకు ఉపాధి పనులకు వెళ్తున్నారు. దీంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. యంత్ర పరికరాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా చాలా పనులు కూలీల ద్వారానే చేయాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఊరట కలుగుతుంది. రైతులపై కూలీల ఖర్చు భారం కూడా కాస్త తగ్గుముఖం పడుతుంది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేక పోయింది. ప్రస్తుతం బీజేపీ, జనసేనతో కలసి అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఎందుకో ఆ హామీలను అమలు చేసే దిశగా ముందుకు మాత్రం వెళ్లడం లేదు. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పలు రకాల పంటలు సాగు చేస్తున్నారు. రైతులు వారి స్థోమతకు మించి మెట్ట ప్రాంతాల్లో బీడు భూములు ఉండకూడదని వ్యవసాయం చేస్తుంటారు. అందులో వచ్చిన ఆదాయంతో జీవనం సాగిద్దామనే ఆశతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయంలో పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో తరచూ నష్టాలే మిగులుతున్నాయి. వరి, వేరుశనగ, సాగు చేస్తున్న రైతులు విత్తనాలు చల్లడం, కోతలు, నూర్పిళ్లు తదితర పనులకు ఎకరా సాగుకు దాదాపు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకానికి వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేస్తే కూలీల కొరతతోపాటు పెట్టుబడి ఖర్చులు కూడా రైతులకు తగ్గుతాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రైతాంగం కోరుతోంది.

రైతులకు ప్రయోజనం



ఉపాధి హామీ పథకానికి వ్యవసాయ రంగాన్ని అనుసంధానిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంట సాగు రైతులకు భారంగా మారుతోంది. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నప్పటికీ లాభాలు మాత్రం రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి. లేదంటే రైతులు వీధుల పాలవుతారు.

– వరప్రసాద్‌రాజు, లింగసముద్రం, వెంకటగిరి నియోజకవర్గం

కష్టాలను గుర్తించాలి



ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి. దాని వలన రైతులతోపాటు కూలీలకు కూడా చాలా మేలు జరుగుతుంది. ప్రస్తుతం వ్యవసాయం ఏ పంట వేసినా కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదు. దీంతో రైతన్నలు నష్టాల్లో కూరుకుపోతున్నారు.

– ఏడుకొండలు, తిప్పిరెడ్డిపల్లి, వెంకటగిరి

అప్పుల పాలవుతున్నాం



రైతులకు పంటల సాగు భారంగా మారింది. వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా దక్కడం లేదు. పెట్టిన ఖర్చులు కూడా రాకపోగా అప్పుల పాలవుతున్నాం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించాల్సి ఉంది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. అప్పుడే కూలీల భారం తగ్గుతుంది.

– రామ్‌గోపాల్‌రెడ్డి, గులించెర్ల, వెంకటగిరి నియోజకవర్గం

క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ పోటీలు


విజేతగా నిలిచిన దక్కిలి జట్టు

దక్కిలి: మండలంలోని లింగసముద్రం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. సోమవారం ఫైనల్ పోటీలలో లింగసముద్రం–దక్కిలి జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేపట్టిన లింగసముద్రం నిర్ణీత ఓవర్లలో 88 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన దక్కిలి జట్టు గెలుపొందింది. దక్కిలి జట్టు విన్నర్స్‌గా, లింగసముద్రం రన్నర్‌గా నిలిచాయి. మొదటి బహుమతి దక్కిలి జట్టుకు రూ.70 వేలు షీల్డ్‌ను, రన్నర్స్‌గా నిలిచిన లింగసముద్రం జట్టుకు రూ.30 వేలు, షీల్డ్‌ను నిర్వాహకులు అందజేశారు.

పంట నష్టంపై సర్వే

దొరవారిసత్రం: మండలం పరిధిలో రెండు రోజుల కిందట అకాలంగా కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలపై స్థానిక వ్యవసాయాధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టారు. మంగళవారం కట్టువాపల్లి, కరటాముడి, పూలతోట, మేలనాలత్తూరు, సింగనాలత్తూరు తదితర గ్రామాల్లో వరి పంట నష్టంపై వ్యవసాయాధికారులు పర్యటించి సర్వే చేపట్టారు. కట్టువాపల్లి, కరటాముడి, పూలతోట తదితర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రీసర్వే సక్రమంగా చేయకపోవడంతో సర్వే నంబర్లు తారుమారై పంట నష్టం అంచనాలో వ్యవసాయాధికారులు ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏఓ జ్యోతిర్మయి, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంతో అధిక లాభాలు

సైదాపురం: రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలని, దీనివల్ల అనేక లాభాలు ఉన్నాయని ఏఓ హైమావతి తెలిపారు. మండలంలోని కొమ్మిపాడు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమ్మ, మిరప పంటలను పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులను మంజూరు చేస్తున్నట్లు ఏఓ వివరించారు. రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలన్నారు.

నిమ్మ రైతులకు ఊరట

సైదాపురం: నిమ్మ ధరల పెరుగుదల మూడు రోజుల నుంచి ఊపందుకుంది. ఇటీవల చలి ప్రభావంతో నిమ్మ ధరలు ఆశించిన స్థాయిలో లేవు. ప్రస్తుతం గూడూరు మార్కెట్‌లో కిలో నిమ్మ కాయలు రూ.25 నుంచి రూ.35 ధర పలుకుతున్నాయి. అయితే నాణ్యత కలిగిన కాయలు ధర రూ.45 వరకు ఉన్నట్లు రైతులు పేర్కొన్నారు. సైదాపురం మండలంలో విస్తారంగా ఉన్న రైతులు నిమ్మ తోటలపైనే ఆ. ధారపడి జీవిస్తున్నారు. శనివారం గూడూరు నిమ్మ మార్కెట్‌లో లూజు (50 కేజీ బస్తా) రూ.2,400 నుంచి రూ.3,300 వరకు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత కలిగిన నిమ్మకాయలకు మరింత ధర లభిస్తోంది.

పక్కాగా రీ సర్వే

గూడూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేను పక్కాగా చేపట్టాలని గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్ సూచించారు. రూరల్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో మంగళవారం రీ సర్వే ప్రక్రియను డిప్యూటీ తహసీల్దార్ చైతన్య ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామంలో సుమారు 28 ఎకరాల భూమి ఉందని, దీనిని మొదటగా ఎంపిక చేశామన్నారు. ఒక రోజుకు సర్వే బృందాలు 20 ఎకరాలు మాత్రమే సర్వే చేసి నివేదికలను సిద్ధం చేసే పనిలో ఉన్నారని అన్నారు. ఆయన వెంట రైతులు, సర్వే బృందాలు ఉన్నారు.

తెలుగుగంగ కాలువకు గండి


గండి పడిన తెలుగు గంగ కాలువ ప్రాంతం

కోట: మండలంలోని చిట్టేడు పంచాయితీ మైక్రోటవర్ కాలనీ సమీపంలో తెలుగుగంగ బ్రాంచ్ కాలువ కోతకు గురై గండి పడింది. దీంతో తెలుగుగంగ నీటి ప్రవాహం దిగువన ఉన్న తాటి చెరువుకు చేరడంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడ్డారు. చెరువు పొంగి పొర్లడంతో సుమారు 30 ఎకరాల్లో వరిపంట నీటి మునిగింది. చిట్టేడు రైతులు తెలుగుగంగ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఏఈ నిరంజన్‌కుమార్ గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే యంత్రాల సాయంతో గండిని పూడ్చి వేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తెలుగుగంగ కాలువల కట్టలు పలుచోట్ల బలహీనంగా ఉన్నట్లు రైతులు తెలిపారు.

ఆలయ హుండీలో నగదు చోరీ



నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని మేనకూరు గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ హుండీలో నగదు చోరీపై మంగళవారం పోలీసుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం పూజారి ఆలూరు కిషోర్ వచ్చే చూసేసరికి ఆలయ ఆవరణంలో ఉన్న హుండీని పగులగొట్టి ఉండడం గమనించారు. హుండీలో సుమారు రూ.10 వేల వరకు నగదు ఉండవచ్చునని ఆలయ కమిటీ సభ్యులు పుట్టు సుధాకర్ తెలిపారు. ఈ విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు


డీఎస్పీని అభినందిస్తున్న సునీతా సేవా సంస్థ నిర్వాహకులు

చిల్లకూరు: గూడూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గీతాకుమారిని మంగళవారం సునీతా సేవా సంస్థ నిర్వహకులు, ఎస్సీ, అట్రాసిటీ మాజీ కమిటీ సభ్యులు కలుసుకుని పుష్ప గుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా సునీతా సేవాసంస్థ నిర్వాహకులు సారంగం సులక్ష్మీ, శ్రీనివాసులు మాట్లాడుతూ సంస్థ ద్వారా మహిళ జీవనోపాధికి అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. గూడూరు పట్టణ, రూరల్ ప్రాంతాలలో మహిళలకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎస్పీని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు న్యాయవాది అరవ పార్వతయ్య, దాసరి వెంకటేశ్వర్లు, దాసరి క్రిష్ణ తదితరులు ఉన్నారు.

మద్దాలిలో కొండచిలువ కలకలం

కోట: మద్దాలి గ్రామస్తులను కొండ చిలువ భయం వెంటాడుతుంది. చెరువులో దాగి ఉంటున్న కొండ చిలువ రాత్రి పూట మూగజీవాలపై దాడి చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలోనే ఇటీవల సుబ్రమణ్యం అనే వ్యక్తి తన పెంపుడు కుక్కను చంపి మింగే ప్రయత్నంలో అతను కేకలు వేయడంతో చెరువులోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం వీధిలో పిల్లలు ఆడుకుంటుండగా వారిని కొండచిలువ వెంబడించింది. దీనిపై గ్రామంలో పెద్దలు సమావేశం నిర్వహించి చర్చించారు. కొండచిలువ కలకలంపై సర్పంచ్ వాణి అటవీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

రాపూరు: మండలంలో గరిమెన పెంట, శానాయిపాళెం గ్రామాల్లో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించినట్లు వైద్యాధికారి సుప్రజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెలకు నట్టల నివారణ మందు, బొబ్బరవ్యాధి టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశామన్నారు. అన్ని గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తామని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనుల పండువగా శాంతి కల్యాణం


స్వామి, అమ్మవార్లకు శాంతి కల్యాణం

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసి యున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామివారి శాంతి కల్యాణాన్ని మంగళవారం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించిన అనంతరం విశేష పూజలు చేపట్టారు. పాలాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలోకి తీసుకుని శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు మూలంరాజు భానుప్రకాష్‌శర్మ కార్యాన్ని జరిపించారు. వివిధ దోష పూజలు చేయించుకునేందుకు తమిళనాడు ప్రాంతం నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ఆవరణ కిటకిటలాడింది. గూడూరుకు చెందిన పల్లంపర్తి సురేంద్రరెడ్డి, చైతన్య, నేహా ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ శశాంక్ పర్యవేక్షించారు.

నిమ్మ పరిశోధనా కేంద్రానికి యంత్ర పరికరాలు


ఇండస్ కాఫీ పరిశ్రమ అందజేసిన యంత్రాలు

నాయుడుపేట టౌన్: మేనకూరు పరిశ్రమల కేంద్రంలో ఉన్న ఇండస్ కాఫీ పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో వెంకటగిరి నిమ్మ పరిశోధన కేంద్రానికి వివిధ యంత్రాలను మంగళవారం అందించారు. వెంకటగిరి సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ నిమ్మ, చీనీ పరిశోధన కేంద్రానికి రూ.3 లక్షలకు పైగా విలువ చేసే పలు యంత్ర పరికరాలను పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.శ్యామ్‌సుందర్‌రెడ్డికి అందజేశారు. మేనకూరు సెజ్ పరిధిలోని ఇండస్ కాఫీ పరిశ్రమ వద్ద డైరెక్టర్ నరేంద్రనాథ్, జీఎం మనీష్ మిశ్ర, హెచ్ఆర్ హెడ్ రమేష్, సీఎఫ్ఓ మహేష్ పెట్లూరు యంత్ర పరికరాలను అందించారు. రెండు పవర్ వీడర్లు, చెట్ల కొమ్మలు కత్తిరించే యంత్రం, గట్ల మీద కలుపు మొక్కలు, గడ్డిని కత్తిరించే యంత్రం, 75 అంగుళాల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్ప్లేలను అందించారు.

మద్యం వద్దు.. మాట నెరవేర్చండి


రోసనూరులో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్ఆర్ సీపీ పోరుబాట

- పెళ్లకూరు జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా
- రోసనూరులో వైఎస్ఆర్ సీపీ పోరుబాట

పెళ్లకూరు: మద్యం బెల్టు షాపులు తొలగించాలని, సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలని పెళ్లకూరు జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రోసనూరు గ్రామంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమానికి నాంది పలికారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా ఆధ్వర్యంలో మహిళలంతా ఫ్లెక్సీలు చేతబట్టి పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పేవన్నీ అబద్దాలని, ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని విమర్శించారు. గ్రామగ్రామాన కుప్పలు తెప్పలుగా ఉన్న మద్యం బెల్టుషాపులను తొలగించి సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలన్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రోసనూరు గిరిజన కాలనీలో ఒక్క వీధికి కూడా సిమెంట్ రోడ్డు వేయకపోవడం అన్యాయమన్నారు. గ్రామంలోని గిరిజనుల పేరుతో పక్కా గృహాల నిధులన్నీ మింగేసిన ఓ టీడీపీ నాయకుడు ప్రజాసేవకుడని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. హైకోర్టు ఆదేశాలు అమలు చేసేలా మండలంలో 112 మద్యం బెల్టు షాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నేతల దుర్మార్గాలను, ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం గ్రామంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఇలకా సుధారాణి, సర్పంచ్‌లు పగడాల హరిబాబురెడ్డి, శనగ రాజయ్య, ఎంపీటీసీలు సుజాత, కుమారస్వామి, వైఎస్ఆర్ సీపీ నేతలు కామిరెడ్డి రాజారెడ్డి, తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, దారా రవి, ఎల్లు మోహన్, సత్యంరాజు, చిరంజీవి, బాలసుబ్రమణ్యం, వీరకుమార్, బాలు, జితేంద్ర, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి


మల్లికార్జున

దక్కిలి: దక్కిలి పోలీసు స్టేషన్‌లో డ్రైవరుగా పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ మల్లికార్జున మంగళవారం మృతి చెందాడు. నెల్లూరు ఏఆర్ కానిస్టేబుల్ మల్లికార్జున రెండేళ్ల నుంచి దక్కిలి పోలీసు స్టేషన్‌లో జీపు డ్రైవరుగా పని చేస్తున్నాడు. గత 15 రోజులు కిందట అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో అప్పటి నుండి నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. పరీక్ష కేంద్రానికి కేటాయించిన రెండు గదులు, వసతులను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ఐదు రోజులపాటు పరీక్షలు జరగనున్న క్రమంలో పరీక్ష కేంద్రానికి వచ్చే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, తహసీల్దార్ జయజయరావు, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

రాపూరు: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. రాపూరు ఆర్టీసీ డిపో నుంచి వెంకటగిరి, గూడూరు మార్గంలో ప్రయాణించిన వారిని లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి మంగళవారం బహుమతులు అందించారు. ప్రతి 15 రోజులకు ఒక లక్కీ డీప్ ద్వారా నలుగురిని ఎంపిక చేసి బహుమతులు అందిస్తున్నట్లు వివరించారు. ఎస్‌టీఐ బషీర్‌అహ్మద్ తదితరులు ఉన్నారు.

మురుగు నీటి మయం


బస్టాండ్‌లో నిల్వ ఉన్న మురుగునీరు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని బస్టాండ్‌కు పోవాలంటే తప్పని సరిగా మురుగునీటిని తొక్కాల్సిందే. బస్టాండ్ నుంచి గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గం కొద్దిగా తక్కువలో ఉండడంతో వీధిలో ఉన్న మురుగు నీరంతా అక్కడికి వచ్చి చేరుతోంది. ఆ నీరు అక్కడే నిల్వ ఉండాల్సి వస్తోంది. మురుగు నీరు దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మోడల్ విలేజ్‌గా నక్కల కాలువ కండ్రిగ


నక్కల కాలువ కండ్రిగలో రీ సర్వే

చిల్లకూరు: భూములను గత ప్రభుత్వం సర్వే చేసేందుకు మొదలు పెట్టిన పనులను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత భూముల సర్వే పూర్తిగా చట్ట విరుద్ధమని పనులను నిలిపి వేసిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వం రీ సర్వే ప్రక్రియ చేపట్టాల్సిందే అని రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేయడంతో తప్పని పరిస్థితిలో రీ సర్వే ప్రక్రియను మొదలు పెట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో మండలానికి ఒక రెవెన్యూ గ్రామాన్ని మోడల్‌గా తీసుకుని సర్వే పనులను సోమవారం నుంచి మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే మంగళవారం కూడా చిల్లకూరు మండలంలోని నక్కలకాలువ కండ్రిగలోని 125 ఎకరాల భూములను సర్వే బృందాలు సర్వే చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీఐఐసీ అధికారులు సర్వే జరిగే ప్రాంతానికి చేరుకుని తమ సంస్థకు ఉన్న సుమారు 55 ఎకరాల భూములను గుర్తించి, హద్దులు వేయాలని కోరారు. అందుకు సంబంధించిన సర్వే నెంబర్ల జాబితాను సర్వేయర్ల బృందానికి అందించారు. అయితే ఈ నక్కల కాలువ కండ్రిగలోని భూములను ఎన్నో ఏళ్లుగా నెలబల్లి రెట్టపల్లి గ్రామానికి చెందిన పేదలు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఈ భూములనే ఏపీఐఐసీకి కేటాయించడంతో పేదలు ఈ ఏడాది కూడా వరి పంటను సాగు చేసుకుని ఉన్నారు. ఈ విషయంపై ఏపీఐఐసీ అధికారులు తిరపతి జిల్లా జోనల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయభరత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సర్వే పూర్తి చేసిన అనంతరం భూములకు హద్దులు ఏర్పాటు చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూములు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఈ సర్వేను మండల సర్వేయర్ మల్లికార్జున్ పర్యవేక్షణలో సచివాలయ సర్వేయర్లు పూర్తి చేస్తున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


రాపూరులో ర్యాలీ

రాపూరు: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం సాగించాలని రాపూరు సీఐ సత్యనారాయణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రాపూరులో మంగళవారం విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణికులు సీటుబెల్టు విధిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. రోడ్డు నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఎస్ఐ వెంకటరాజేష్, డీఎం అనిల్‌కుమార్, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకాసురులపై చర్యలు తప్పవు


ఇసుకతో పట్టుబడిన ట్రాక్టర్లు

చిట్టమూరు(చిల్లకూరు): ఇష్టానుసారంగా అనుమతులు లేకుండా పరిశ్రమలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తప్పవని చిట్టమూరు ఎస్ఐ చిన బలరామయ్య హెచ్చరించారు. మండలంలోని మెట్టు వద్ద ఉన్న రీచ్ నుంచి అక్రమంగా ఇసుకను అర్ధరాత్రి సమయంలో తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను మంగళవారం వేకువజామున పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణముఖిలో ఇసుకను అక్రమంగా తరలించకుండా పలు ప్రాంతాలలో ట్రెంచ్‌లు ఏర్పాటు చేశామని అయినప్పటికీ కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా తడ ప్రాంతంలోని పరిశ్రమలకు ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలసి దాడులు చేశామన్నారు. 8 ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేసి కోర్టుకు అప్పగిస్తామని తెలిపారు.

సర్వీస్ ప్రొవైడర్ల నమోదుకు అవకాశం


సర్వీస్ ప్రొవైడర్లకు అవగాహన కల్పిస్తున్న మెప్మా అధికారులు

గూడూరు రూరల్: వినియోగదారులకు సేవలు అందించేందుకు సర్వీస్ ప్రొవైడర్లను ఎంపికకు మెప్మా అధికారులు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక మాయా బజార్‌లోని మెప్మా కార్యాలయంలో సర్వీస్ ప్రొవైడర్లను ఎంపిక చేసే ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా మెప్మా సిటీ మేనేజర్ పెంచలయ్య మాట్లాడుతూ పట్టణ, రూరల్ ప్రాంతాలలో నివశించే వారి కుటుంబాలకు వివిధ రకాల అవసరాలను అందుబాటులో ఉంచేలా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందని అన్నారు. అనంతరం పలువురు పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి శిక్షణ ఇచ్చి ఐడీ కార్డు, సర్టిఫికెట్ ఇస్తామని అటు తరువాత వారు ఎక్కడైనా పని చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓలు చందన, లత, సులోచన, ఉష, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.